సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 27 । జనవరి । 2023



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

అభివృద్ధి అందరి బాధ్యత

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

- ధరణి పోర్టల్‌లో 1,02,575 దరఖాస్తుల పరిష్కారం
- ఫార్మాసిటీతో లక్ష మందికి ఉపాధి లభిస్తుంది
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ అమయ్‌కుమార్ వెల్లడి



జాతీయ జెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ అమయ్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అందరి భాగస్వామ్యంతోనే జిల్లా అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేదరిక నిర్మూలన కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా చూడాలన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

పెట్టుబడుల ఖిల్లా..

రంగారెడ్డి జిల్లా పెట్టుబడుల ఖిల్లాగా మారిందని, జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ తమ శాఖలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని కలెక్టర్ తెలిపారు. 19,333 ఎకరాల్లో రూ.63 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న యాచారం ఫార్మాసిటీ ద్వారా లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా ధరణి పోర్టల్‌కు 1,97,947 దరఖాస్తులు వచ్చాయని. ఇందులో 1,02,575 అప్లికేషన్లను ఆమోదించామని, 80,209 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని వివరించారు. జిల్లాకు 6,645 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరవగా ఇప్పటికే 2,061 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందని, మిగిలినవాటిని త్వరలోనే పూర్తి చేసి, లబ్ధిదారులకు అందజేస్తామని స్పష్టంచేశారు. రూ.10.27 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు చెక్ డ్యామ్‌లను నిర్మించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు.

పల్లె, పట్టణ ప్రగతి

పల్లె ప్రగతిలో భాగంగా 2022- 23 ఆర్థిక సంవత్సరంలో స్టేట్ ఫైనాన్స్ కమిషన్, 15వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ ద్వారా ఇప్పటివరకు రూ.85.13 కోట్ల నిధులు నేరుగా ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. పట్టణ ప్రగతిలో భాగంగా ప్రభుత్వం 16 మున్సిపాలిటీలకు రూ.129 కోట్లు మంజూరు చేసి, ఇప్పటికే రూ.77 కోట్లు విడుదల చేసిందన్నారు. రూ.18 కోట్లతో 16 వైకుంఠధామాలు, రూ.64.50 కోట్లతో 16 సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 363 అర్బన్ పార్కుల ఏర్పాటును లక్ష్యంగా చేసుకుని, ఇప్పటికే 257 పార్కులను పూర్తి చేశామని వెల్లడించారు. 468 గ్రామాలు, 40 పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశామని, కంటివెలుగు కార్యక్రమం ద్వారా ఇప్పటికే 40,192 మందికి పరీక్షలు చేసి, వీరిలో 8,539 మందికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేసినట్లు చెప్పారు.

కొత్తగా మరో 21 సబ్‌స్టేషన్లు

ఈ ఆర్థిక సంవత్సరం జిల్లాలో రూ.75.80 కోట్ల అంచనా వ్యయంతో కొత్తగా మరో 21 సబ్ స్టేషన్లు నిర్మించాలని నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా స్వయం సహాయక సంఘాలకు రూ.636 కోట్లు, స్త్రీ నిధి ద్వారా మరో రూ.60 కోట్ల రుణాలు ఇచ్చినట్లు ప్రకటించారు. రూ.140 కోట్లతో 86 బీటీ రోడ్లకు మరమ్మతులు చేపట్టామన్నారు. వేడుకల్లో అదనపు కలెక్టర్లు ప్రతీక్ జైన్, తిరుపతిరావు, డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. శంకర్‌పల్లి మోడల్ స్కూల్ సహా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయా విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన సుమారు 300 మంది జిల్లా అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.



నృత్యాలతో ఆకట్టుకున్న బాలబాలికలు



మీర్‌పేట్‌లోని జిల్లెలగూడ వద్ద త్రివర్ణ దుస్తులు ధరించి విద్యార్థుల విన్యాసాలు

న్యూస్‌రీల్

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఆలయ వేడుకల వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సర్దార్‌నగర్ శివాలయానికి గురువారం ఆయన రూ.50 వేల విరాళం అందజేశారు. అనంతరం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 8నుంచి 12వరకు సంగమేశ్వర స్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూర్ నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటయ్య, గ్రామస్తులు బాలరాజ్, హరీష్, శశాంక్‌రెడ్డి, కుమార్, పాండు, శ్రీశైలం, శేఖర్, అశోక్, కృష్ణాజీ, మల్లేశ్, శ్రీను తదితరులు ఉన్నారు.

29న చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 29న తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ జరగనుంది. ఎల్బీ స్టేడియంలోని యోగా హాల్, వుషు హాల్‌లో ఈ టోర్నీని నిర్వహిస్తారు. అండర్–7, 9, 11, 13, 15, 17, అండర్–19 వయో విభాగాల్లో బాలబాలికలకు పోటీలు ఉంటాయి. స్పాట్ ఎంట్రీలు స్వీకరించరు. ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే వారు ఈ నెల 27వ తేదీలోపు తమ ఎంట్రీలను ఖరారు చేయాలి. ఆసక్తి గలవారు 73375 78899, 73373 99299లలో నిర్వాహకులను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ కోరారు.

సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ఎగ్జిబిషన్

చార్మినార్: గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని సాలార్‌జంగ్ మ్యూజియంలోని సెంట్రల్ బ్లాక్‌లో గురువారం 'ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ అండ్ ఫ్రీడం ఫైటర్స్' ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్‌ను మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి ప్రారంభించారు. మ్యూజియం ప్రాంగణంలో పతాకావిష్కరణ, సీఐఎస్‌ఎఫ్ పరేడ్ అనంతరం ఆయన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలతో పాటు ఆనాటి మహానుభావులతో కూడిన ఈ ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్ వారం రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు.

రథ సప్తమికి ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 28న రథసప్తమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం టీఎస్‌ఆర్టీసీ రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ సహా జిల్లా కేంద్రాల నుంచి ప్రముఖ ఆలయాలు వేములవాడ, ధర్మపురి, యాదగిరి గుట్ట, మన్నెంకొండ, గూడెంలకు ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఇందులో కరీంనగర్ నుంచి వేములవాడకు 10, ధర్మపురికి 10, నల్లగొండ నుంచి యాదగిరిగుట్టకు 10, మహబూబ్‌నగర్ నుంచి మన్నెంకొండకు 10, ఆదిలాబాద్ నుంచి గూడేనికి 5, హైదరాబాద్ కేపీహెచ్‌బీ నుంచి అనంతగిరికి 5 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

బదిలీలు ఆపేయండి

- ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయ సంఘాల మండిపాటు
- ట్రాన్స్‌ఫర్లలో అక్రమాలకు తెరలేపారని ఆరోపణ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వం చేపట్టిన అక్రమ బదిలీలను వెంటనే ఆపేయాలని పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ప్రభుత్వమే దొడ్డిదారిన ఉపాధ్యాయుల బదిలీలకు తెరతీయడం దారుణమని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుంకరి రాజమణి, ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. సాధారణ బదిలీలు, పదోన్నతులకు షెడ్యూల్‌ను ప్రకటించి.. విధివిధానాలు ఖరారు చేసినప్పటికీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా చేపట్టాల్సిన బదిలీలను గుట్టుగా ఎలా నిర్వహిస్తారని నిలదీశారు.

సర్కారు తీరు సరికాదు..

తపస్ జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావ్, కార్యదర్శి పూజారి రమేశ్ సర్కారు తీరును తప్పుబట్టారు. ప్రభుత్వ పెద్దల అండదండలు కలిగిన ఉపాధ్యాయులను హెచ్‌ఆర్‌ఏ ప్రాంతాల్లోని అనువైన పాఠశాలలకు బదిలీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

పారదర్శకంగా చేపట్టాలి

దొడ్డిదారిన చేపడుతున్న ట్రాన్స్‌ఫర్లను తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్ నాయక్, వెంకటప్ప మండిపడ్డారు. బదిలీలను పారదర్శకంగా పూర్తిచేయాలని, ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దని హితవు పలికారు.

జనసాంద్రత, అక్షరాస్యతలో 'గ్రేటర్'

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో ఉన్న హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలు జనసాంద్రతతో పాటు అక్షరాస్యతలోనూ మేటిగా నిలిచాయి. గత సంవత్సరానికి సంబంధించి తాజాగా విడుదలైన రాష్ట్ర స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్ (అట్లాస్)లో ఈ వివరాలున్నాయి. హైదరాబాద్ జిల్లాలో అర్బన్ జనాభా నూరు శాతం కాగా, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని జనాభాలో అర్బన్ జనాభా 91.5 శాతంగా ఉంది. హైదరాబాద్ జిల్లాలో జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 18,161 కాగా, మేడ్చల్–మల్కాజిగిరిలో 2,321గా ఉంది. అక్షరాస్యతలోనూ ఈ రెండు జిల్లాలే అగ్రస్థానంలో నిలిచాయి. ఇది హైదరాబాద్‌లో 83.2 శాతంగా, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 82.5 శాతంగా ఉంది. గ్రేటర్‌లోని పాఠశాలు, అవగాహన కలిగిన ప్రజలు, ప్రభుత్వం కార్యక్రమాల అమలులోనూ ముందున్నాయి.

విద్యారంభం కరిష్యామి

- జ్ఞాన సరస్వతి ఆలయంలో వసంత పంచమి వేడుకలు
- చిన్నారులతో అక్షరాలు దిద్దించిన హంపీ పీఠాధిపతి
- భక్తులతో కిటకిటలాడిన నందివనపర్తి



చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న విద్యారణ్య భారతి స్వామిజీ



పూజలు అందుకున్న జ్ఞాన సరస్వతీదేవి

యాచారం: చదువుల తల్లి సరస్వతీదేవి స్మరణతో నందివనపర్తి గ్రామం మార్మోగింది. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని జ్ఞాన సరస్వతీ మాత ఆలయంలో గురువారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజారి రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకే అమ్మవారి మూల విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ చేతుల మీదుగా హోమం చేయించారు. జిల్లాతో పాటు నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో వసతులు కల్పించారు. సాయంత్రం పదో తరగతి విద్యార్థులతో గ్రామంలో అమ్మవారి పల్లకీ సేవ, ఊరేగింపు నిర్వహించారు. విద్యారణ్య భారతి స్వామిజీ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. సుమారు 250 మందికి పైగా చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. అక్షరాభ్యాసం కోసం అవసరమైన వస్తువులు, పూజా సామగ్రిని ఆలయ నిర్వాహకులే సమకూర్చారు. అనంతరం తల్లిదండ్రులు తమ చిన్నారులతో కలిసి అమ్మవారి మూల విగ్రహన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయి..

చదువుల తల్లి కొలువుదీరిన నందివనపర్తి గ్రామం భవిష్యత్తులో గొప్ప పుణ్యక్షేత్రంగా విలసిల్లుతుందని విద్యారణ్య భారతిస్వామిజీ అన్నారు. ఆలయాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని తెలిపారు. దేవతామూర్తులను పూజించే ప్రాంతాలు పాడిపంటలు, సుఖసంతోషాలతో సస్యశ్యామలంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ, ఆలయ కమిటీ సభ్యులు కొంగళ్ల జోగిరెడ్డి, కొడూరి రామనాథం, నిఖిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతా రెడీ

- సార్వత్రిక ఎన్నికల విధులకు పోలీసు టీమ్స్ సిద్ధం
- గ్రేటర్ విభాగంలో కొత్తగా ఐదు జోన్లు
- సైబరాబాద్, రాచకొండలో మాదాపూర్ మినహా.. అన్ని జోన్ల డీసీపీలకూ స్థానచలనం
- ఎస్‌ఓటీ, ట్రాఫిక్ విభాగాల విభజన, అధికారుల కేటాయింపు

సాక్షి, సిటీబ్యూరో: సార్వత్రిక ఎన్నికలకు కేసీఆర్ సర్కారు పావులు కదుపుతోంది. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు షెడ్యూల్డ్‌ను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా పోలీసు విభాగంపై దృష్టి సారించింది. ఈ ఏడాది ఆఖరులోగా ఎన్నికలు జరగడం అనివార్యమైన తరుణంలో తగిన కార్యాచరణ రూపొందిస్తోంది. ఎన్నికల విధులు, బందోబస్తుతో పాటు ఇతరత్రా అంశాలలో ప్రధానమైన పోలీసు విభాగంలో పలు కీలకమైన బదిలీలు చేసింది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఒకే దఫా 91 మంది పోలీసులకు స్థానచలనం కల్పిస్తూ బుధవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేయగా.. అందులో సుమారు 50 మంది పోలీసు బదిలీలు మూడు కమిషనరేట్ల పరిధిలోనే జరిగాయి. రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్లలో మాదాపూర్ మినహా అన్ని జోన్ల డీసీపీలు బదిలీ అయ్యారు. రాచకొండలో దీర్ఘకాలంగా ఒకే చోట పోస్టింగ్‌లో ఉన్న మల్కాజిగిరి, ఎల్బీనగర్, భువనగిరి డీసీపీలకు స్థానచలనం కలిగింది. సైబరాబాద్‌లో బాలానగర్, శంషాబాద్ జోన్ల డీసీపీలను కొత్తగా ఏర్పాటు చేసిన మేడ్చల్, రాజేంద్రనగర్ జోన్లకు బదిలీ చేశారు. రాచకొండలో ఇప్పటికే మల్కాజిగిరి, భువనగిరి, ఎల్బీనగర్ జోన్లు ఉండగా.. కొత్తగా మహేశ్వరం జోన్ అవతరించింది. ప్రస్తుతం ఎల్బీనగర్ జోన్‌లో ఉన్న ఇబ్రహీంపట్నం డివిజన్, వనస్థలిపురం డివిజన్లు మహేశ్వరం జోన్ కిందికి వస్తాయి.

కొత్త జోన్‌లకు తొలి డీసీపీలు వీరే..

పునర్వ్యవస్థీకరణలో భాగంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో శాంతి భద్రతల విభాగంలో కొత్తగా అయిదు జోన్లను ఏర్పాటు చేశారు. తాజా బదిలీలో వీటికి తొలి డీసీపీలను నియమితులయ్యారు. గ్రేహౌండ్స్ ఏఎస్పీగా ఉన్న కిరణ్ ప్రభాకర్‌ను హైదరాబాద్ సౌత్‌వెస్ట్‌కు, రూపేశ్‌ను సౌత్‌వెస్ట్‌కు బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న చింతమనేని శ్రీనివాస్‌ను మహేశ్వరం జోన్‌కు, ప్రస్తుతం శంషాబాద్ డీసీపీగా ఉన్న జగదీశ్వర్ రెడ్డిని రాజేంద్రనగర్‌కు, బాలానగర్ డీసీపీగా ఉన్న సందీప్‌ను మేడ్చల్ జోన్ డీసీపీగా నియమించారు.

ఎస్‌ఓటీ, ట్రాఫిక్‌లోనూ విస్తరణ..

ఇప్పటివరకు సైబరాబాద్, రాచకొండ రెండు కమిషనరేట్లలో స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ), ట్రాఫిక్‌లో ఒకటే జోన్ కింద ఉన్నాయి. పట్టణీకరణతో వాహనాలు, ట్రాఫిక్ రద్దీ పెరగడంతో ఆయా విభాగాలను కూడా విస్తరించారు. తాజా బదిలీల్లో వీటికి కూడా కొత్త అధికారులను నియమించారు. రాచకొండను మల్కాజిగిరి, ఎల్బీనగర్ ఎస్‌ఓటీలుగా, ట్రాఫిక్‌ను 1, 2 జోన్లుగా.. సైబరాబాద్‌ను ఎస్‌ఓటీ–2, మాదాపూర్ ఎస్‌ఓటీలుగా, ట్రాఫిక్‌ను 1, మేడ్చల్ ట్రాఫిక్‌కు విభజించారు.

రాచకొండ జాయింట్ సీపీ బదిలీ ట్విస్ట్..

ఈ నెలలో 20 రోజుల వ్యవధిలో ఓ పోలీసు ఉన్నతాధికారి రెండుసార్లు బదిలీ కావటం గమనార్హం. ఈ నెల 3న 29 మంది ఐపీఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేయగా.. ఇందులో హైదరాబాద్ డీడీ జాయింట్ కమిషనర్‌గా ఉన్న 2008 బ్యాచ్‌కు చెందిన గజరావు భూపాల్‌ను రాచకొండ జాయింట్ సీపీగా స్థానచలనం కల్పించారు. కానీ, ఆయన మూడు వారాలైనా బాధ్యతలు చేపట్టలేదు. దీంతో తాజా బదిలీల్లో గజరావును తిరిగి యథాస్థానానికి కేటాయించి.. ఆ స్థానంలో కరీంనగర్ కమిషనర్ 2006 బ్యాచ్‌కు చెందిన వి.సత్యనారాయణను బదిలీ చేశారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన భూపాల్ డిప్యుటేషన్‌పై తెలంగాణలో విధులు నిర్వర్తిస్తుండటం గమనార్హం.

వాహనసనం!

- పార్క్ చేసిన చోటే తుప్పు పడుతున్న వాహనాలు
- ఎండలో ఎండి.. వానలో తడుస్తున్న వైనం
- వేలం ప్రక్రియను పట్టించుకోని అధికారులు



సరూర్‌నగర్, చైతన్యపురి, ఎల్‌బీనగర్, వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌ల పరిధిలో సీజ్ చేసిన వాహనాలు

హుడాకాంప్లెక్స్: పలు కేసుల్లో పట్టుబడ్డ వాహనాలు తుప్పు పట్టిపోతున్నాయి. సరూర్‌నగర్, చైతన్యపురి, ఎల్‌బీనగర్, వనస్థలిపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో సీజ్ చేసిన బైకులు, ఆటోలు, కార్లు ఏళ్ల తరబడి ఎండలో ఎండి.. వానలో తడుస్తున్నాయి. ప్రస్తుతం ఇవన్నీ ఎందుకూ పనికిరాకుండా పోయాయి. వీటిని స్క్రాప్ చేయడం తప్ప మరో మార్గం లేదు. ఆయా పీఎస్‌ల ఆవరణలోని వాహనాలను తుప్పు తినేస్తోంది. వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను ఏళ్ల తరబడి సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఓటీ పోలీస్ స్టేషన్ ఆవరణలో పడేస్తున్నారు. దీంతో కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. పట్టుకున్న వాహనాలకు వేలం వేయకపోవడం, వీటిపై కోర్టుల్లో కేసులు నమోదై ఉండటంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇందులో అనుమానాస్పదంగా లభించినవి కొన్ని కాగా.. సారా, నిషేధిత పదార్థాలు తరలిస్తున్నవి, చోరీ కేసుల్లో దొరికినవి మరికొన్ని ఉన్నాయి. వీటి యజమానుల ఆచూకీ తెలియకపోవడంతో వేలం వేయాల్సి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

కోర్టు కేసుల్లో ఉండటంతో..

వాహనదారులకు నోటీసులు ఇచ్చి ఎప్పటికప్పుడు పరిష్కారం చేయడం నిరంతర ప్రక్రియ. కోర్టు కేసులు ఉన్న వాహనాలపై నిర్ణయం తీసుకోలేం. కొన్నింటికి సంబంధించి ఓనర్ల అడ్రస్‌లు దొరకడం లేదు. గుర్తింపులేని వెహికిల్స్‌ను మూడు నెలలకోసారి అంబర్‌పేట పోలీసు గ్రౌండ్‌లో వేలం వేస్తుంటాం. వాహనాల యజమానులు కేసులను పరిష్కరించుకుని, విడిపించుకుపోతే ఈ బాగుంటుంది.

– శ్రీధర్‌రెడ్డి, ఏసీపీ, ఎల్‌బీనగర్

గణతంత్ర వేడుకలకు వెళ్తూ..

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి


మృతుడు ప్రవీణ్(ఫైల్)

మొయినాబాద్: గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం వెళ్తూ బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందాడు. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ మండల పరిధిలోని గండిపేట చౌరస్తా సమీపంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై శిరీష తెలిపిన వివరాలు.. మొయినాబాద్ మండలం అమీర్‌గూడ గ్రామానికి చెందిన మేకగూడెం ప్రవీణ్ (30) మంచిరేవుల సమీపంలో ఉన్న గ్రేహౌండ్స్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై వెళ్తుండగా మండల పరిధిలోని గండిపేట చౌరస్తా సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్ మధ్యలో ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. దీంతో అతని తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం


భూమిక (ఫైల్)

షాబాద్‌షరీఫ్: మండల కేంద్రంలో యువతి అదృశ్యమైన సంఘటన షాబాద్‌షరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీరాం కాలనీకి చెందిన యాటకారి భూమిక (20) ఈనెల 25న కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి బయటికి వెళ్లింది. ఎంతకి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆమె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయమై గురువారం తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉత్తమ సేవలకు పురస్కారం


కందుకూరు: ప్రశంసా పత్రం అందుకుంటున్న ఆర్డీఓ సూరజ్‌కుమార్


కందుకూరు: ఎంపీడీఓ వెంకట్రాములు


మొయినాబాద్‌రూరల్: ఏపీఎం కె.రవీందర్


మంచాల: ఎంపీడీఓ శ్రీనివాస్


యాచారం: తహసీల్దార్ సుచరిత


ఇబ్రహీంపట్నం రూరల్: పశు సంవర్ధక శాఖ అధికారి సురేష్


మహేశ్వరం: సీనియర్ అసిస్టెంట్ కృష్ణ


ఇబ్రహీంపట్నం రూరల్: శంకర్‌పల్లి ఏపీఓ నాగభూషణ్


మహేశ్వరం: పంచాయతీ కార్మికుడు నర్సింహ


కొత్తూరు: కంప్యూటర్ ఆపరేటర్ బాలరాజు


అబ్దుల్లాపూర్‌మెట్: ఆర్ఐ జి.సత్యనారాయణరావు

కందుకూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం పలువురి ఉత్తమ సేవలను గుర్తించి వారికి అవార్డులను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా గురువారం కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఎంపీడీఓ ఎస్.వెంకట్రాములు కలెక్టరేట్‌లో కలెక్టర్ అమయ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి పలువురు అభినందనలు తెలిపారు.

మొయినాబాద్ ఏపీఎం రవీందర్‌కు జిల్లాస్థాయి అవార్డు

మొయినాబాద్‌రూరల్: మొయినాబాద్ మండలానికి చెందిన మహిళా సమైఖ్య భవనంలో మొయినాబాద్ మండల ఏపీఎం కె.రవీందర్‌కు జిల్లాస్థాయి ఉత్తమ ప్రశంసాపత్రాన్ని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అందజేశారు. మహిళల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని గుర్తించి అవార్డును ప్రదానం చేశారు.

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలరాజు, శానిటేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అంజమ్మకు ప్రశంసా పత్రాలు అందజేశారు. గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ వీరేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉత్తమ ఎంపీడీఓగా చిలుకూరి శ్రీనివాస్

మంచాల: జిల్లా ఉత్తమ మండల అభివృద్ధి అధికారిగా మంచాల మండల ఎంపీడీఓ చిలుకూరి శ్రీనివాస్ అవార్డు అందుకున్నారు. మంచాల మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పల్లె ప్రగతి పనుల నిర్వహణలో వారు చేసిన కృషిని గుర్తించి ప్రభుత్వం ఉత్తమ ఎంపీడీఓగా ఎంపిక చేసింది.

యాచారం తహసీల్దార్‌కు..

యాచారం: తహసీల్దార్ సుచరితకు జిల్లా ఉత్తమ అవార్డు వచ్చింది. మండలంలోని 24 గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించినందుకు గాను, ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరమే పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా కృషి చేసినందుకు ఆమె కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగినట్లు ఆమె పేర్కొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు సత్కారం

ఇబ్రహీంపట్నం రూరల్: కలెక్టర్ అమయ్‌కుమార్ శంకర్‌పల్లి ఈజీఎస్ ఏపీఓ కందుకూరి నాగభూషణ్, కొంగరకలాన్ పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్‌లకు వారి సేవలను గుర్తించి ఉత్తమ అవార్డులు అందజేశారు. ప్రతిఒక్కరూ బాగా కష్టపడి పనిచేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు.

రెవెన్యూ, పారిశుద్ధ్య కార్మికులకు..

మహేశ్వరం: మండలంలో రెవెన్యూ విభాగంలో రైతులకు ఉత్తమ సేవలు అందించి ఎప్పటికప్పుడు భూ సమస్యలు పరిష్కరించినందుకు మహేశ్వరం రెవెన్యూ విభాగానికి చెందిన సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, టైపిస్టు కల్పనలకు ఉత్తమ అవార్డులు, ప్రశంసాపత్రాలను కొంగరకలాన్ కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ అమయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు. అలాగే మండల పరిధిలోని పెద్దమ్మ తండాకు చెందిన నేనావత్ గణపతి, గంగారం గ్రామ పంచాయతీకి చెందిన అదిరాల నర్సింహలకు గ్రామాల్లో ఉత్తమ పారిశుద్ధ్య సేవలు అందించినందుకు, పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు కృషి చేసినందుకు కలెక్టర్ వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

బెస్ట్ ఆర్ఐగా సత్యనారాయణరావు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న జి.సత్యనారాయణరావు ఉత్తమ ఆర్ఐగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ చేతుల మీదుగా సత్యనారాయణరావు అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

ఉత్తమ ఎంపీడీఓగా అంజినేయులు

కొందుర్గు: ఉత్తమ ఎంపీడీఓగా కొందుర్గు మండల ఎంపీడీఓ అంజినేయులు ఎంపిక ఆయ్యారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

'ఆదర్శ' విద్యార్థులకు ప్రశంస

శంకర్‌పల్లి: జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. నృత్య ప్రదర్శనలో మంచి ప్రతిభను కనబర్చిన విద్యార్థులను కలెక్టర్ అమయ్‌కుమార్, అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌లు అభినందించి ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, మండల విద్యాధికారి అక్బర్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్‌లోని డెక్కన్ భవనంలో ఈ నెల 19న జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి డెక్కన్ భవనాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రమాదం సమయంలో అధికారులు సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవడంతో భారీ నష్టం జరగకుండా నివారించగలిగినట్లు వెల్లడించారు.

మెడికల్ విద్య ఎంతో పవిత్రమైనది

- చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి
- స్పోర్ట్స్ కాంప్లెక్స్ గ్రౌండ్, బాలికల హాస్టల్ భవనం ప్రారంభం


హాస్టల్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: వైద్య విద్య అనేది ఎంతో పవిత్రమైనదని దీనిని విద్యార్థులు చక్కగా నేర్చుకొని సమాజానికి ఉపయోగపడే వైద్యులుగా ఎదగాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో గురువారం వారు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం మెడికల్ కళాశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ గ్రౌండ్‌ను, బాలికల హాస్టల్ నూతన భవనాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. మెడికల్ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యం పెంచుకోవాలన్నారు. కళాశాలలో క్రీడల కోసం కాంప్లెక్స్ గ్రౌండ్‌ను కొత్తగా ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దీంతో పాటు మెడికల్ విద్యను అభ్యసించే బాలికలకు వీలుగా ఉండేందుకు నూతన హాస్టల్ భవనం నిర్మించినట్లు తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు కళాశాల చైర్మన్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు బాగా కష్టపడి చదువుకొని, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కళాశాల డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, డీన్, ప్రిన్సిపాల్ జోయారాణి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, నాయకులు మాణిక్యరెడ్డి, చింటు, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మినీ స్టేడియం, డిగ్రీ కళాశాల భవనాలను పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే

త్వరలోనే చేవెళ్ల బస్‌స్టేషన్ విస్తారణ, మినీస్టేడియం పనులు, డిగ్రీ కళాశాల భవనం పనులు కూడా పూర్తి చేయించేందుకు కృషి చేస్తామని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలు అన్నారు. గురువారం ఎంపీ ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి చేవెళ్లలోని మినీ స్టేడియాన్ని, పక్కనే ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలించారు. వీరి వెంట స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఎం. క్రిష్ణారెడ్డి, పి. ప్రభాకర్, సత్తి, ఎదిరే రాములు, వెంకటేశ్, సాయినాథ్, మోహన్‌రెడ్డి, మిట్ట వెంకటరంగారెడ్డి, మహేశ్ తదితరులున్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

రామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్


లాలాజీ మహరాజ్ జయంతి వేడుకలకు హాజరైన విదేశీయులు

- కొనసాగిన లాలాజీ మహరాజ్ జయంతి ఉత్సవాలు
- అలరించిన అమ్జద్ ఆలీఖాన్ సంగీతం

నందిగామ: ధ్యానంతో మానసిక ప్రశాంతత పొందవచ్చని, తద్వారా ఆరోగ్యంగా జీవించగలుగుతారని రామచంద్ర మిషన్ గురుజీ, హార్ట్‌ఫుల్ నెస్ కేంద్రం గ్లోబల్ గైడ్ కమ్లేష్ పటేల్ సూచించారు. నందిగామ మండలం కాన్హా శాంతి వనంలోని హార్ట్ ఫుల్ నెస్ కేంద్రంలో రామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు లాలాజీ మహరాజ్ 150వ జయంతి ఉత్సవాలు రెండో రోజు గురువారం సాగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గురుజీ మాట్లాడుతూ.. ధ్యానం చేయడంతో అనేక రుగ్మతలు తొలగిపోతాయని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. లాలాజీ మహరాజ్ సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. అనంతరం ప్రముఖ సంగీత కళాకారుడు ఉస్తాద్ అమ్జద్ ఆలీఖాన్ ఆలపించిన సంగీతం ఎంతగానో ఆకట్టుకుంది. ఉత్సవాలకు హాజరైన వేలాది మందితో కలిసి గురూజీ ధ్యానం చేశారు. సుమారు 160 దేశాలకు చెందిన వారు ధ్యానంలో పాల్గొన్నారు.

కూతురును హాస్టల్‌లో దించేందుకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- కూతురుకు గాయాలు
- ఖానాపూర్ బస్‌స్టేజీ సమీపంలో ప్రమాదం

చేవెళ్ల: కూతురును హాస్టల్‌లో దించేందుకు బైక్‌పై గ్రామం నుంచి బయలుదేరిన తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కూతురుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ బస్‌స్టేజీ సమీపంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. చేవెళ్ల ఎస్ఐ హయ్యుమ్ తెలిపిన వివరాలు.. మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన చాకలి కృష్ణ (35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ముగ్గురు కూతుళ్లు పెద్ద కూతురు పాలమాకుల వద్ద ఉన్న హాస్టల్‌లో ఉండి చదువుకుంటుంది. ఇటీవల ఇంటికి వచ్చిన కూతురును గురువారం హాస్టల్ వద్ద దింపేందుకు బైక్‌పై కూతురుతో కలిసి ఇంటి నుంచి బయలుదేరాడు. ఖానాపూర్ బస్‌స్టేజీ సమీపంలోకి రాగానే ఎదురుగా చేవెళ్ల వైపు నుంచి వస్తున్న ఇన్నోవా కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న క్రిష్ణ ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. బైక్ వెనకాల కూర్చున్న కూతురు ఎగిరి దూరంగా పడటంతో కాళ్లు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాయపడిన బాలికను స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించటంతో వచ్చి పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య పద్మ, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. మృతదేహాన్ని పోలీసులు చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.